క్లుప్తంగా

ఖర్గేను కలిసిన ఎమ్మెల్యే బాలునాయక్



మల్లికార్జున ఖర్గేకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న బాలునాయక్

దేవరకొండ : కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ గురువారం హైదరాబాద్‌లో కలిశారు. శుక్రవారం ఎల్బీ స్టేడియంలో నిర్వహించే రాజ్యాంగ పరిరక్షణ కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న గ్రామ, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుల సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ క్రమంలో రాష్ట్ర టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌తో కలిసి ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే బాలునాయక్ జన్మదినం సందర్భంగా ఆయనకు ఖర్గే జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ



రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ

కొండమల్లేపల్లి : స్థానిక పోలీస్ స్టేషన్‌ను బుధవారం అర్ధరాత్రి ఎస్పీ శరత్ చంద్రపవార్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్లప్పుడు ప్రజలకు అందుబాటులో ఉంటూ సమర్థవంతమైన సేవలు అందించేందుకు కృషి చేయాలన్నారు. కమ్యూనిటీ పోలింగ్ ద్వారా గ్రామాల్లో నేర నియంత్రణలో భాగంగా సీసీ టీవీల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలన్నారు. అంతకుముందు పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించి, రిసెప్షన్ మేనేజ్మెంట్, ఉమెన్ హెల్ప్ డెస్క్, స్టేషన్ రైటర్, లాక్ అప్ తదితరాలను పరిశీలించారు. ఎస్పీ వెంట కొండమల్లేపల్లి సీఐ నవీన్ కుమార్, ఎస్ఐ అజ్మీర రమేష్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

మహిళపై దాడి చేసిన వ్యక్తులకు జరిమానా

నిడమనూరు : మహిళపై దాడి చేసిన వ్యక్తులకు నిడమనూరు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి జరిమానా లేదా నెలరోజుల శిక్ష విధించారు. త్రిపురారం మండలం జప్తి వీరప్పగూడెం గ్రామానికి చెందిన గుడిపాటి లక్ష్మమ్మ తన సొంత పొలంలో పశువుల మేతకోసం చొప్ప కోస్తుండగా, స్థానికులు పక్క పొలానికి చెందిన గుడిపాటి వెంకన్న, నవీన్, సైదయ్య తదితరులు పొలం హద్దు పంచాయతీ దృష్టిలో పెట్టుకొని లక్ష్మమ్మను దుర్భాషలాడుతూ, దాడికి దిగారు. ఈ ఘటనపై అప్పటి ఎస్ఐ యాదయ్య, ఆగస్టు 31, 2016న కేసు నమోదు చేసి చార్జిషీట్ నమోదు చేశారు. గురువారం కోర్టులో వాదనలు ముగియగా న్యాయమూర్తి టిస్వప్న శిక్ష ఖరారు చేశారు. నేరానికి పాల్పడ్డ వెంకన్న, నవీన్, సైదయ్యలకు ఒక్కొక్కరికీ రూ.1500 ల జరిమానా లేదా, నెల సాధారణ జైలు శిక్ష విధించారు.

అథ్లెటిక్స్‌లో లిటిల్ ఫ్లవర్ విద్యార్థి ప్రతిభ

మిర్యాలగూడ : నల్లగొండలోని మేకల అభినవ్ స్టేడియంలో జూన్ 29న నిర్వహించి అథ్లెటిక్స్ అండర్-14 పోటీల్లో ట్రయథ్లాన్-బీలో పట్టణంలోని లిటిల్ ఫ్లవర్ హైస్కూల్ విద్యార్థి కెతావత్ శ్రీధర్ జిల్లా స్థాయిలో మొదటిస్థానంలో గెలుపొందారు. ఈ నెల 6న వరంగల్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు అర్హత పొందారని పాఠశాల ప్రిన్సిపాల్ కె.జయరాజన్ తెలిపారు. ప్రతిభ చాటిన విద్యార్థి శ్రీధర్‌ను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ జెన్సీ జయరాజన్, పాఠశాల హెచ్ఎం సుజయ్ కుమార్, వ్యాయామ ఉపాధ్యాయుడు నీలం రమేష్, శంకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

దళితరత్న అవార్డు గ్రహీతకు సన్మానం

పెద్దవూర : ఎస్సీ, ఎస్టీ, బీసీ. మైనార్టీ ప్రజల సామాజిక, న్యాయబద్ధమైన హక్కుల కోసం పోరాటం చేసినందుకు గాను ఇటీవల ఉత్తమ దళితరత్న అవార్డు అందుకున్న పులిమాల కృష్ణారావు మాదిగను జాతీయ నాయకుల విగ్రహాల కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కృష్ణారావు మాదిగ సేవలను పలువురు గుర్తు చేస్తూ అభినందించారు. ఈ కార్యక్రమంలో బొంగరాల వెంకటేశ్వర్లు, ఆదాసు విక్రం,వెంకటయ్య, సైదిరెడ్డి, లక్ష్మయ్య, సత్యనారాయణ, విద్యాసాగర్, దేవదాసు, పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి

కొండమల్లేపల్లి : జూలై 9న దేశవ్యాప్తంగా నిర్వహించే సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నల్ల వెంకటయ్య కోరారు. గురువారం సమ్మెను విజవయంతం చేయాలని కోరుతూ సీఐటీయూ కొండమల్లేపల్లి గ్రామపంచాయతీ ఈఓ డాకు నాయక్‌కు సమ్మె నోటీసు అందజేశారు.

అంతరాయం.. నిరంతరం

- గుర్రంపోడులో తరచూ విద్యుత్ సరఫరా నిలిపివేత
- అస్తవ్యస్తంగా విద్యుత్ వైర్లు
- ఏబీ స్విచ్‌లు ఉన్నా ఎల్‌సీ తీసుకుంటున్న సిబ్బంది



ఏఎమ్మార్పీ కాలనీలో వేలాడుతున్న విద్యుత్ తీగలు



డబ్బా కొట్ల మధ్యన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

గుర్రంపోడు : మండలకేంద్రంలో విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయాలతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలం చెల్లిన విద్యుత్ తీగలు, కొత్తగా విద్యుత్ లైన్లు ఏర్పాటు చేయకపోవడం, ఓవర్‌లోడ్ సమస్యలతో రోజులో పలుమార్లు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుంది. మండలకేంద్రంలో త్రీఫేజ్ విద్యుత్ సరఫరాకు ప్రత్యేక లైన్ పాక్షికంగానే ఉండటంతోపాటు వ్యాపారుల అవసరాలకు తగ్గట్టుగా విద్యుత్ సరఫరాను అందించలేకపోతున్నారు. మండలకేంద్రం విస్తరిస్తున్నా అందుకు తగ్గట్లుగా ట్రాన్స్‌ఫార్మర్లు లేకపోవడంతో సమస్యలు తలెత్తుతున్నాయి. మండలకేంద్రంలో సింగిల్ ఫేస్ ట్రాన్స్‌ఫార్మర్లు మార్చి కొత్తగా నిర్మించేందుకు స్థల సేకరణకు దుకాణదారుల నుంచి అభ్యంతరాలు తెలుపుతుండటం సమస్యగా మారింది. విద్యుత్ లైన్లు తరుచూ తెగిపోతూ ప్రమాదాలు జరుగుతున్నాయి. నాంపల్లి రోడ్డులో హెచ్‌టీ లైన్ తెగి ట్రాన్స్‌ఫార్మర్‌పై పడటంతో ఇళ్లో విద్యుత్ పరికరాలు కాలిపోయాయి. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు ఏబీ స్విచ్‌లు ఉన్నా.. ఒకే స్తంభంపై రెండు విద్యుత్ లైన్లు ఉండటం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. అంతేగా ఏబీ స్విచ్‌లు ఉపయోగించకపోవడంతో తరచూ సబ్‌స్టేషన్ నుంచి ఎల్‌సీ తీసుకుంటున్నారు. దీంతో సరఫరాలో తరుచూ అంతరాయం ఏర్పడుతుంది. ఏఎమ్మార్పీ క్యాంపు కాలనీలో విద్యుత్ లైన్లు వేలాడుతుండటంతో గాలికి తీగలు తగిలి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుంది.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు

మండలకేంద్రంలో ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా ఉన్నాయి. మండలకేంద్రం కూడలిలో ఆర్‌అండ్‌బీ బంగ్లా ఎదుట గల ట్రాన్స్‌ఫార్మర్ డబ్బా కొట్టుల మధ్య ఉండి సిబ్బంది వెళ్లలేనంత ఇరుకు ఉంది. దీంతో ఈ ట్రాన్స్‌ఫార్మర్ ఏబీ స్విచ్ ఆన్ ఆఫ్ చేసే పరిస్థితి లేక అవసరమైనప్పుడల్లా సబ్‌స్టేషన్ నుంచే సరఫరా నిలిపివేయాల్సి వస్తుంది. ట్రాన్స్‌ఫార్మర్ కాలితే తొలగించడానికి కూడా స్థలం లేకుండా చుట్టూ డబ్బా కొట్టులు ఉన్నాయి. నాంపల్లి రోడ్డులో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ తక్కువ ఎత్తులో ఉండి చేతికి తగిలే విధంగా తీగలు ఉన్నాయి. ఈ ట్రాన్స్‌ఫార్మర్ పక్కనే ఆనుకుని డబ్బా కొట్టు ఉండి ప్రమాదం పొంచి ఉంది. మండలకేంద్రంలో ట్రాన్స్‌ఫార్మర్లు ఎత్తైన పిల్లర్ మీద ఏర్పాటు చేయాల్సి ఉంది. చుట్టూ రక్షణ కంచె ఉండాల్సి ఉండగా ఎక్కడా లేవు. ఇందుకు తమకు నిధుల మంజూరు లేదని అధికారులు అంటున్నారు.

లో ఓల్టేజీతో ఇబ్బందులు



నాంపల్లి రోడ్డులో లో ఓల్టేజీ సమస్య ఉంది. తరుచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుంది. నాణ్యమైన విద్యుత్ సరఫరా జరగడం లేదు. తరుచూ ఫ్యాన్లు, మోటార్లు కాలిపోతున్నాయి. అధికారులు సమస్యను పరిష్కరించాలి.

– మందలి లింగయ్య, గుర్రంపోడు

త్వరలో కొత్త లైన్ ఏర్పాటు చేస్తాం

మండలకేంద్రంలో త్రీఫేజ్ సరఫరాకు ప్రత్యేక లైన్ త్వరలో ఏర్పాటు చేస్తాం. నాంపల్లి రోడ్డులో క్యాంపు కాలనీ ఒక ఫీడర్, రోడ్డుకు మరో వైపు ఉన్న గృహ సముదాయాలకు మరో ఫీడర్ వేరు చేసి సమస్యను ఒకటి, రెండు రోజుల్లో పరిష్కరిస్తాం. విద్యుత్ లైన్లు మార్చేందుకు, ట్రాన్స్‌ఫార్మర్లు ఎత్తులో ఏర్పాటు చేసి రక్షణ వలయం ఏర్పాటుకు నిధుల మంజూరు లేదు. కొద్ది రోజులుగా గాలుల వల్ల సరఫరాలో తాత్కాలికంగా తరుచూ అంతరాయం అంతటా ఏర్పడింది.

– శ్రీకాంత్‌రెడ్డి, విద్యుత్ ఏఈ, గుర్రంపోడు

ఫీజు బకాయిలు విడుదల చేయాలని ధర్నా



సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న పీడీఎస్‌యూ విద్యార్థులు

మిర్యాలగూడ టౌన్ : పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్లను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం మిర్యాగూడ సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయం డీఏఓ శ్రీనివాసశర్మకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ధర్నానుద్దేశించి పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఇందూరు సాగర్, జిల్లా ప్రధాన కార్యదర్శి పూలే పవన్, టీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు కొండేటి మురళి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 18 నెలలు అవుతున్నప్పటికీ విద్యార్థులకు ఫీజురీయింబర్స్‌మెంటు, పెండింగ్ స్కాలర్‌షిప్‌లు రూ.7200కోట్లు విడుదల చేయకుండా కాలయాపన చేస్తుందని ధ్వజమెత్తారు. దీంతో చాలా మంది పేద విద్యార్థులు ఉన్నత చదువులకు దూరం అయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులకు మినహా అన్నింటికి డబ్బులు చెల్లిస్తున్నారని, పేద విద్యార్థులు ఏం పాపం చేశారని ప్రశ్నించారు. విద్యారంగంలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, డోనేషన్లు తీసుకుంటున్న ఇంజనీరింగ్ కళాశాలలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో అన్ని విద్యార్థి సంఘాలతో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు ఎస్‌కె సోయల్, మాధవి, స్వాతి, ఉమామహేశ్వరీ, స్వప్న, రాజు, వెంకటేష్, ప్రభాకర్, ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షులు జ్వాల వెంకటేశ్వర్లు, విద్యావంతుల వేదిక నాయకులు హరి, ప్రజా సంఘాల నాయకులు రామన్న, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు బొంగరాల నర్సింహ్మ, నాయుడు ఉన్నారు.

పన్నులు చెల్లించి అభివృద్ధికి సహకరించండి

- మున్సిపల్ కమిషనర్ పి. శ్రీనివాస్

మిర్యాలగూడ టౌన్ : మున్సిపాలిటీలో పన్నులు సకాలంలో చెల్లించి అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ పి. శ్రీనివాస్ కోరారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయ సమావేశం మందిరంలో వంద రోజుల ప్రణాళికలో భాగంగా వివిధ శాఖలకు సంబంధించి లబ్ధిదారులు, మున్సిపల్ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు పన్నుల వసూళ్ల వేగవంతంగా చేపట్టాలన్నారు. బోర్డుల ప్రకటనలు, ఆస్తి పన్నులు, నీటి పన్నులను చెల్లించని వారికి వెంటనే నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్, ఆర్‌ఓ జ్ఞానేశ్వరీ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ, టీపీఎస్ అంజయ్య, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు సాంబయ్య, సాజీ, మాజీద్‌ఖాన్, శంకర్, సంగీత్, ఎల్లయ్యలతో పాటు వార్డు ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

రోస్టర్ పద్ధతిలో నియామకాలు చేపట్టాలి



గురుకులాల కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న బీసీ సంఘం నేతలు

మిర్యాలగూడ టౌన్ : రాష్ట్ర వ్యాప్తంగా నియమించిన కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, రెగ్యూలర్ ఉద్యోగాల్లో రోస్టర్ పద్ధతిని పాటించాలని కోరుతూ గురువారం హైదరాబాద్‌లో బీసీ గురుకులాల సెక్రటరీ సైదులుకు బీసీ సంఘాల ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జీడయ్య యాదవ్, బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్గింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ మాట్లాడారు. ఈ వినతి పత్రాన్ని అందించినవారిలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు సతీష్, మురళి, చిమట రవి, నాగరాజు ఉన్నారు.

పట్టాలు ఇవ్వాలని వినతి



సబ్‌కలెక్టర్ నారాయణ్‌అమిత్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

తిరుమలగిరి(నాగార్జునసాగర్): మండలంలోని తునికినూతల, రాజవరం, యల్లాపురం రెవెన్యూ శివారులో పునరావాసం పంపిణీ చేసిన భూమికి పట్టాలివ్వాలని కోరుతూ సుంకిశాలతండా రైతులు గురువారం తిరుమలగిరి తహసీల్దార్ కార్యాలయంలో మిర్యాలగూడ సబ్‌కలెక్టర్ నారాయణ్ అమిత్‌కు వినతిపత్రం అందజేశారు. యల్లాపురం, రాజవరం, తునికినూతల శివారులను కలుపుకొని సుంకిశాల తండా రైతులకు పునరావసం ద్వారా 1400 ఎకరాల భూమిని కేటాయించినట్లు తెలిపారు. ఆ భూమిని పైలెట్ ప్రాజెక్టులో భాగంగా సర్వే చేసినప్పటికీ ఫారెస్ట్ అధికారులు గెజిట్ తీయకపోవడంతో పట్టాలు రాకుండా ఆగిపోయినట్లు సబ్‌కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అలాగే యల్లాపురం రెవెన్యూ శివారులోని సర్వే నంబర్ 255లో చెక్కోలంతండా, యల్లాపురం తండా, పిల్లిగుండ్ల తండా గిరిజన రైతులకు రెవిన్యూ పట్టాలు ఇవ్వాలని వినతి పత్రంలో పేర్కొన్నట్లు తెలిపారు. స్పందించిన సబ్‌కలెక్టర్ సీసీఎల్ఏ అధికారులతో మాట్లాడి అర్హులైన రైతులకు పట్టాలు వచ్చేలా కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో కొర్ర శంకర్ నాయక్, రమావత్ రమేష్ నాయక్, జటావత్ లాలు, లాలు, హనుమంతు, భాస్కర్, కృష్ణా, పాల్తి నరేష్, ఉపేందర్, రాము ఉన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

తిరుమలగిరి(నాగార్జునసాగర్): విద్యుదాఘాతంతో గేదె మృతి చెందిన సంఘటన మండలంలోని జువ్విచెట్టుతండాలో చోటు చేసుకుంది. బాధిత రైతు సఫావత్ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం ఉదయం సమయంలో విద్యుత్ వైరు తెగి గెదే పై పడిపోవడంతో అక్కడిక్కడే మృతి చెందినట్లు తెలిపారు. గెదే విలువ సుమారు రూ.50వేలు ఉంటుందని తమ కుటుంబాన్ని ఆదుకోవాలని ఆయన కోరారు.

వన మహోత్సవానికి సన్నద్ధం కావాలి



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ సుదర్శన్

దేవరకొండ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న వన మహోత్సవానికి మున్సిపల్ అధికారులు, సిబ్బంది సన్నద్ధం కావాలని దేవరకొండ మున్సిపల్ కమిషనర్ వై.సుదర్శన్ అన్నారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆర్పీలు,మున్సిపల్ అధికారులు, సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటేందుకు కాలనీలు, ప్రధాన రహదారులపై అనువైన స్థలాలు గుర్తించాలని ఆయన పేర్కొన్నారు. వార్డుల వారిగా నియమించిన ఆర్పీలు, ప్రత్యేక అధికారులు ప్రజలను భాగస్వాములను చేస్తూ విరివిగా మొక్కలు నాటేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆయన సూచించారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించేందుకు గాను జియో ట్యాగింగ్ చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సక్రునాయక్, రాకేష్, జగమంతు, తదితరులున్నారు.

ప్లాస్టిక్‌ను నివారించి పర్యావరణాన్ని కాపాడాలి



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు

దేవరకొండ : ప్లాస్టిక్‌ను నివారించి పర్యావరణాన్ని కాపాడాలని మున్సిపల్ కమిషనర్ వై.సుదర్శన్ అన్నారు. గురువారం అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ రహిత దినోత్సవం సందర్భంగా మున్సిపల్ అధికారులు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ప్రారంభించి ఆయన మాట్లాడారు. పర్యావరణానికి పెనుముప్పుగా మారిన ప్లాస్టిక్ భూతాన్ని తరిమి కొట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్లాస్టిక్ నిర్మూలకు ప్రజలు సైతం అధికారులకు సహకరించాలని ఆయన కోరారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల అనేక అనర్థాలు కలుగుతున్నాయని, వాటిని ఎక్కడపడితే అక్కడ పడవేయడంతో సమస్య మరింత జఠిలంగా మారుతుందన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ సురిగి శంకర్, పర్యావరణ ఇంజనీర్ సక్రునాయక్, ప్రేమ్, శరత్, మున్సిపల్ అధికారులు, పారిశుద్ధ్య కార్మికులున్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

నిడమనూరు : మండలంలోని ఎర్రబెల్లి గ్రామానికి చెందిన బూత్ కమిటీ అధ్యక్షుడు పెదమాము శ్రీనివాస్ మృతి చెందాడు. గురువారం మృతుడి కుటుంబాన్ని ఆదుకునేందుకు నియోజకవర్గ ఇన్‌చార్జ్ కంకణాల నివేదితరెడ్డి రూ.10వేల అందజేసింది. అలాగే బీజేపీ జిల్లా నాయకుడు మన్నెం రంజిత్ కూడా రూ.10వేల ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షురాలు పెందోటి శిరీషా, నాయకులు పెందోటి నాగరాజు, కార్యదర్శి కంభంపాటి కోటేష్, మండల ఉపాధ్యక్షుడు రామలింగం, శంకర్, ఉన్నం ఉపాకిరణ్, చిరంజీవి, వెంకన్న , మహిళలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందజేస్తున్న బీజేపీ నాయకులు

మహిళా ప్రిన్సిపాల్‌ను నియమించాలి

మిర్యాలగూడ అర్బన్ : మండలంలోని అవంతీపురంలోని గిరిజన బాలిక ఆశ్రమ పాఠశాలలో మహిళా ప్రిన్సిపాల్‌ను నియమించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గురువారం సబ్‌కలెక్టర్ కార్యాలయ అధికారి(డీఏఓ)కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు కుర్ర సైదానాయక్ మాట్లాడారు. విద్యార్థినులు విద్యనభ్యసిస్తున్నారని వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా మహిళా ప్రిన్సిపాల్‌ను నియమించాలని కోరారు. పాఠశాలలో మట్టిగుట్ట తొలగించినట్లయితే ఆటస్థలం ఏర్పడుతుందని అందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు జగన్‌నాయక్, నాయకులు అనిల్, అఖిల్, బన్నీ, మణి ఉన్నారు.

అర్హులందరికీ ఓటు హక్కు కల్పించాలి

- అదనపు కలెక్టర్ శ్రీనివాసులు



నిడమనూరు : మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాసులు

నిడమనూరు : అర్హులందరికీ ఓటు హక్కు కల్పించే బాధ్యత బీఎల్‌ఓలదే ప్రధాన పాత్ర అని జిల్లా అదనపు కలెక్టర్ జె. శ్రీనివాసులు అన్నారు. గురువారం నిడమనూరు ఆదర్శ పాఠశాలలో బూత్ స్థాయి అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. శిక్షణ కార్యక్రమానికి నిడమనూరు, మాడుగులపల్లి మండలంలోని 12 బూత్ అధికారులు, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు 58మంది, ఆరుగురు సూపర్‌వైజర్లు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారిగా తహసీల్దార్ జంగాల కృష్ణయ్య, ఎన్నికల డీటీ మల్లికార్జున్, గిర్దావర్లు దాడి రాజిరెడ్డి, సందీప్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

నిడమనూరు ఆదర్శ పాఠశాలలో బూత్ స్థాయి అధికారులకు జాతీయ స్థాయి శిక్షణ కార్యక్రమానికి వచ్చిన అదనపు కలెక్టర్ జె.శ్రీనివాసులు పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులను భోజనం ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం సూచించిన మెనూ ప్రకారం భోజనం అందించాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు.

ఓటరు నమోదుపై అవగాహన కల్పించాలి

దేవరకొండ : ఓటరు నమోదపై బీఎల్‌ఓలు క్షేత్రస్థాయి అవగాహన కల్పించాలని దేవరకొండ ఆర్డీఓ రమణారెడ్డి అన్నారు. గురువారం దేవరకొండ ఎంకేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి రోజు దేవరకొండ మండల బీఎల్‌ఓలకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఓటరు నమోదు ప్రక్రియలో బీఎల్‌ఓలు క్రియాశీలకంగా వ్యవహరించాలని ఆయన సూచించారు. అర్హులైన ఓటు హక్కును నమోదు చేసుకునే విధంగా అవగాహన కల్పించాలన్నారు. బీఎల్‌ఓలు బూత్‌లలో అందుబాటులో ఉండి ఓటర్లను చైతన్య పర్చాలన్నారు. ఓటరు లిస్టులో మార్పులు, చేర్పులకు అవకాశం ఉన్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, మాస్టర్ ట్రైనర్లు కట్టెబోయిన శ్రీనివాస్‌యాదవ్, పెనుకొండ శేఖర్, వాసికర్ల రమేష్, గోవర్ధన్‌రావు ఉన్నారు.

ప్రభుత్వ భూమిని పరిశీలించిన సబ్‌కలెక్టర్



తహసీల్దార్‌ను వివరాలు అడిగి తెలుసుకుంటున్న సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్

మిర్యాలగూడ : దామరచర్ల మండల శివారులోని సర్వే నంబర్ 735 సర్వే నంబర్‌లో 35.06 ఎకరాల ప్రభుత్వ భూమిని మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ జవహర్‌లాల్ మాట్లాడుతూ గతంలో దీంట్లో 13ఎకరాల భూమిని స్వాతంత్ర్య సమరయోధుల పేరిట అక్రమ పట్టాలు సృష్టించి స్వాహా చేసేందుకు కొందరు అక్రమదారులు యత్నించారన్నారు. దీని విచారించగా నకిలీ అని తేలడంతో సంబంధిత పట్టాను సైతం రద్దు చేసినట్లు సబ్ కలెక్టర్‌కు వివరించారు. ఇదే భూమిలో గతంలో సైతం 5ఎకరాల్లో వెంచర్ చేయగా వాటిని సైతం తొలగించినట్లు తెలిపారు. దీనికి సంబందించిన పూర్తి సమాచారం, రికార్డును మిర్యాలగూడ సబ్ కలెక్టర్ కార్యాలయంలో సమర్పించాలని ఆదేశించారు. ప్రభుత్వ భూమిని ఎవరైనా కబ్జాలకు పాల్పడినా ఉపేక్షించేది లేదని ఎంతటివారినైనా వదిలిపెట్టమన్నారు. ప్రభుత్వ భూములను కాపాడేందుకు రెవెన్యూ యంత్రాంగం కృషి చేస్తుందన్నారు. ఆయన వెంట ఆర్ఐ సతీష్ తదితరులు ఉన్నారు.

భవిత కేంద్రం పనుల పరిశీలన

హాలియా : పట్టణంలోని బొడ్రాయి బజారు సమీపంలో ఏర్పాటు చేసిన భవిత కేంద్రం భవన నిర్మాణ పనులను గురువారం అనుముల మండల ప్రత్యేక అధికారి, ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్ నారాయణ అమిత్ పరిశీలించారు. భవిత కేంద్రం నిర్మాణ పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. భవిత కేంద్రం వికలాంగులకు ఉపయోగపడే విధంగా చూడాలని, ఈ ప్రాంతం లో భవిత సెంటర్ ఉన్నట్లు అందిరికీ తెలిసేలా ప్రచారం చేయాలని ఆయన అధికారులకు సూచించారు. భవిత సెంటర్ ముందు ఉన్న మురికి కాల్వపై సీసీ వర్క్ చేయాలని ఎంఈఓ గుండా కృష్ణమూర్తి అదనపు కలెక్టర్‌ను కోరగా వెంటనే స్పందించి ఆయన మురుగు కాల్వపై సీసీ వర్క్ చేయాలని కమిషనర్ రామదుర్గారెడ్డికి ఆదేశాలు జారీ చేశారు. అంతకు ముందు పట్టణంలోని కేజీబీవీ పాఠశాలలో చేపడుతున్న రేకుల షెడ్డు పనులను పరిశీలించారు. పాఠశాల్లో మధ్యాహ్న భోజనం అమలు తీరును, సమస్యలను విద్యార్థులను అడిగి తెలుకున్నారు. కొద్దిసేపు విద్యార్థులతో ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ కృష్ణమూర్తి, కమిషనర్ రామదుర్గారెడ్డి, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ హైమావత్, ఆర్ఐ నవీన్‌కుమార్, వర్క్ ఇన్‌స్పెక్టర్ సతీష్‌కుమార్ తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యే బాలునాయక్ జన్మదిన వేడుకలు



దేవరకొండ : కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

దేవరకొండ : ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ జన్మదిన వేడుకలు గురువారం దేవరకొండలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని మార్కెట్ యార్డులోని ఆయన నివాసం వద్ద నిర్వహించిన వేడుకల్లో కాంగ్రెస్ నాయకులు పున్న వెంకటేశ్వర్లు, హన్మంతు వెంకటేష్‌గౌడ్ కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీశైలంయాదవ్, యూనూస్, శ్రీను, మురళి, యాదయ్య, అంజన్ ఉన్నారు.

కొండమల్లేపల్లి : దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ జన్మదినవేడుకల సందర్భంగా గురువారం కొండమల్లేపల్లి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ నాయిని జమున మాధవరెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, యుగంధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డిండి : దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ జన్మదిన వేడుకల సందర్భంగా మండల కేంద్రంలో ఈ సందర్భంగా కేక్ కట్ చేసి ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, యూత్ మండలాధ్యక్షుడు సాయికుమార్, పాల్గొన్నారు.

చందంపేట : ఎమ్మెల్యే బాలునాయక్ జన్మదిన వేడుకలను గురువారం చందంపేట మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు నిర్వహించారు. మాజీ ఎంపీపీ ఏర్పుల గోవిందుయాదవ్ విద్యార్థులకు 800 నోట్ బుక్స్, పెన్నులు అందజేశారు. అలాగే మల్లారెడ్డి విద్యార్థులకు అరటిపండ్లను అందజేశారు.

ప్రభుత్వ నిబంధనలు పాటించాలి



ఎరువుల దుకాణాన్ని పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి శ్రవణ్‌కుమార్

మాడుగులపల్లి : ఎరువుల దుకాణాల వ్యాపారులు ప్రభుత్వ నియమ, నిబంధనలను పాటించాలని జిల్లా వ్యవసాయాధికారి పాల్వాయి శ్రవణ్‌కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పలు ఎరువుల దుకాణాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించి మాట్లాడారు. ఎరువులను కొనుగోలు చేసే రైతులు తప్పనిసరిగా ఆధార్ కార్డు తీసుకోని రావాలని, డీలర్లు ఈ-పాస్ యంత్రం ద్వారా మాత్రమే ఎరువుల విక్రయాలు నిర్వహించాలని ఆయన సూచించారు. ఎరువులను ఎమ్మార్పీ ధర కంటే అధిక ధరకు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. మండలంలో సరిపడినంత యూరియా నిలవ్లు ఉన్నాయని, రైతులు యూరియాను ఎక్కువ మొత్తంలో కాకుండా అవసరానికి తగినట్లుగా కొనుగోలు చేయాలని ఆయన సూచించారు. రైతు డీలర్లు రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలని, ఎవరైన డీలర్లు నాసిరకం విత్తనాలు అందిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు రశీదులు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ శివరాంకుమార్, డీలర్లు ఉన్నారు.

వ్యవసాయ మార్కెట్ ఉద్యోగుల నిరసన



మార్కెట్ యార్డు ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

మిర్యాలగూడ : మహబూబ్‌నగర్ మార్కెట్ కార్యదర్శి భాస్కర్‌పై ఆ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ దాడి చేయడాన్ని ఖండిస్తూ గురువారం మిర్యాలగూడ మండలంలోని అవంతీపురం వ్యవసాయ మార్కెట్ యార్డు ఎదుట ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఆ మార్కెట్ కమిటీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మధుబాబు మాట్లాడారు. నిరసన వ్యక్తం చేసిన వారిలో వ్యవసాయ మార్కెట్ కమిటీ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఇ.వెంకటేశం, సూపర్‌వైజర్లు శ్రీహరి, శ్రీకాంత్, సుజాత, రమ, ఉమా, స్రవంతి, పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్

పెద్దవూర : విద్యతోనే ఉజ్వలమైన భవిష్యత్ సాధ్యమని తహసీల్దార్ శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గురువారం మండల అభివృద్ధి అధికారి ఉమాదేవి, ఎంఈఓ తరి రాముతో కలిసి నోట్‌బుక్స్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీ ప్రభ, ఆర్ఐ దండ శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు చంద్రమౌళి, నరేందర్, రాములు, వెంకటరమణ, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

నోట్‌బుక్స్, బ్యాగుల పంపిణీ

కొండమల్లేపల్లి : కొండమల్లేపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు దాత చెట్ల శ్రీనివాస్ ఆర్థిక సహకారంతో గురువారం విద్యార్థులకు నోటు బుక్స్, బ్యాగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ దాత చెట్ల శ్రీనివాస్ దాతృత్వాన్ని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం కె.ఉదయ, పీఆర్టీయూ అధ్యక్షులు ఎ.అంజయ్య తదితరులు పాల్గొన్నారు.